“అది మాత్రం తక్కువ పనా?” రాజు అంటున్నాడు.

“ఆ పని కోసం బయటవాళ్ళకిచ్చిన రేటు నీకూ ఇస్తాను. నీకు వీలున్నప్పుడు వచ్చి వెళ్తుండు. లేదా నా కవసరం వచ్చినప్పుడు పిలిపిస్తాను”.

“బయటవాళ్ళకిచ్చిన రేటా!”

“అంటే రహస్యమైన వ్యవహారం  కాదు. బహుశ చట్టవిరుద్ధమైంది కూడా కాకపోవచ్చు”.

“ఆ డబ్బు నాకు సరిపోదు. నెలకి వెయ్యి చొప్పున ఏమి సరిపోతుంది?”

డాక్టర్ విశాల్ నవ్వు వినిపించింది “వెయ్యేం ఖర్మ? నువ్వు తల్చుకుంటే మూడువేలు కూడా సంపాదించవచ్చు. రోజుకి వంద చొప్పున”.

“ చెప్పటానికి సులభం. అదెంత కష్టమైనపనో అనుభవిస్తే తెలుస్తుంది” కోపంగా అన్నాడు రాజు.

“ఇంతకీ నన్నేం చెయ్యమంటావు?”

“ఎవరో కళ్ళ స్పెషలిస్ట్ వస్తున్నాడట, నాకో రెండురోజుల్లోగా పదిహేను వేలు కావాలి”.

“ఇదేమీ గవర్నమెంట్ ఆఫీసు కాదు. ఫ్యాక్టరీ అంతకన్నా కాదు. కాంపన్సేషన్లూ, గ్రాట్యుటీలు ఇవ్వటానికి...”

“నేను భిక్షం అడగటం లేదు. న్యాయంగా నాకు రావలసిన వాటా అది”.

“అవును, నీదే కానీ మైండ్ మాగ్నో థెరపీ ఆలోచన మాత్రం నాది. రాష్ట్రంలో హిప్నోటిస్టులు చాలామంది అయిపోయారని వారినుంచి పోటీ తట్టుకోవటం కోసం హిప్నో థెరపీని మాగ్నో థెరపీగా మార్చాను. అప్పటినుంచీ జనం ఎలా వస్తున్నారో చూశావుగా”.

రాజు లేచి “నేను వెళ్తున్నాను. రేపు సాయంత్రానికి మీరు నాకు పదిహేను వేలు పంపించాలి” అన్నాడు. అదే ఆఖరిమాట అన్నట్టు.

“ పంపకపోతే?”

“మీరు చేసిన పని ఒక్కటి బయటపెడితే చాలు. జనం మిమ్మల్ని కుక్కని కొట్టినట్టు కొడతారు. పోలీసులు అరెస్టు చేసి జైల్లో పెడతారు”.

డాక్టర్ మాట్లాడలేదు. రాజు లేచి గుమ్మం దగ్గిరకి వెళ్ళాడు. అక్కడ ఆగి అన్నాడు “లాయర్ శంకరాన్ని చేసినట్టు నన్నూ చేయటానికి ప్రయత్నం చేయకండి. మీరు చేసిందేమిటో కవర్లో వ్రాసి పెట్టి వుంచారు. నా మరణానంతరం బయటపడేట్టుగా” అని బయటకు నడిచాడు.

మధూహ తన కుర్చీలోంచి చప్పున లేచి గబగబా నడుస్తూ క్లినిక్ చుట్టూ తిరిగి, తన యథాస్థానంలోకి వచ్చింది. అప్పటికి రాజు తడుముకుంటూ అక్కడికి చేరుకున్నాడు.

అతడితో కలిసి ఇంటి వైపు వస్తూండగా “ఏమన్నాడు డాక్టర్?” అని అడిగింది ఏమీ తెలియనట్టుగా.

“అనటానికి ఏముంది? బాగా బెదిరించాలి. ఇచ్చి తీరుతాడు”

“ఏమని బెదిరించావు?”

“అవన్నీ అడక్కు”

మధూహ నిరాశ చెందింది. ఈ విసుగు కోపంలోనైనా అతడు ఏమైనా చెబుతాడేమోనని ఆశించింది.

ఏ...దో... వుంది. చాలా నిగూఢమైన రహస్యం! లేకపోతే డాక్టర్ విశాల్‌లాటి వాడు బెదరడు.

"ఏమిటది?"

ఏ రహస్యాన్ని ఒక డాక్టరూ, కాంపౌండరూ కలిసి ఇంతకాలం పంచుకుంటూ వచ్చారు?

## 3

"అటువంటి వాడిని నువ్వెలా ప్రేమించగలిగావు?" ప్రహసిత్ అడిగాడు మధూహ సమాధానం చెప్పలేదు.

"నాకు తెలిసినంతలో నువ్వు చాలా విచక్షణాజ్ఞానం వున్నదానివి. రాజుకీ డాక్టర్ విశాల్‌కి మధ్య జరిగిన సంభాషణ వింటూంటే  అతడిమీద నాకు సదభిప్రాయం కలగటంలేదు".

"నాకూ కలగటం లేదు" విషాదంగా నవ్వింది మధూహ.   "ఈ క్షణం వరకూ నేనిదే ఆలోచిస్తున్నాను. నేనింకా అతన్ని ప్రేమిస్తున్నానా? లేక ఇదంతా అతడి మీద జాలా? అదీ కాకపోతే, అతడిని ప్రేమించినందుకు అతడిని మార్చటానికి చేస్తున్న ఆఖరి ప్రయత్నమా? ఇటువంటి అనుభవం గతంలో ఒకరికి వచ్చి వుంటుంది. ఆమెని అడిగితే చెపుతుంది..."

"రావణుడి భార్య మండోదరిని" అంటూ నవ్వింది.

ఆమెలో మునుపటంత విషాదం లేదు.

ప్రహసిత్ కూడా నవ్వాడు.  ఆమె అంది.

"ప్రస్తుతం నాలాటి వాళ్ళు చాలామంది వున్నారు.  నేను కాలేజీలో చాలా తెలివైనదాన్నే. మీరు అన్నట్టు మంచి మార్కులే వచ్చేవి.  కానీ ఇప్పుడున్న లోకజ్ఞానం అప్పుడు లేదు. ఇంటర్మీడియెట్ చదివే వయసున్నది చూశారూ- అది చాలా భయంకరమైనది. మనచుట్టూ తిరిగే కుర్రాడిని ముందు 'నో' అనటం...అతడు

దిగులుగా వుంటే, కొంతకాలానికి 'ఓ.కే.' అనటం... అంతా సినిమాల ప్రభావం" ఆమె ఆగి, తిరిగి చెప్పటం ప్రారంభించింది.

"అలాగే నేనీ ప్రేమలో పడ్డాను. రాజు నా వెనుకే తిరిగేవాడు. హీరోయిన్ ముందు ఒప్పుకోకూడదుగా. నేనూ అలాగే 'నో' అన్నాను. మణికట్టు క్రింది భాగాన '1045, గురువారం' అని పచ్చబొట్టు పొడిపించుకున్నాడు. నన్ను చూసిన మొదటి క్షణం గంటలూ నిముషాలతో సహా గుర్తుండడం కోసం అలా ముద్రించుకున్నానన్నాడు. కరిగిపోయాను... హీరోయిన్ ఏదో ఒక టైమ్‌లో కరిగిపోవాలి కదా. అయితే ఈ వ్యవహారంలో నన్ను మోసం చేయాలన్న ఆలోచన కూడా అతడికేమీలేదు. సిన్సియర్‌గానే పచ్చబొట్టు పొడిపించుకున్నాడు. ఆ వయసులో కుర్రవాళ్ళు అంత సిన్సియర్‌గానే వుంటారనుకుంటాను. ఆ విధంగా ఇద్దరం ప్రేమలో పడ్డాం" ఆమె గతంలోకి జారుకుంది.

"నేను గ్రాడ్యుయేషన్‌లో చేరాను. అతడు ఇంటర్మీడియేట్‌తో ఆపు చేశాడు. అది మొదటిదెబ్బ. సాధారణంగా ఇంటర్మీడియేట్ స్థాయిలో మొదట ప్రేమలో పడ్డ అమ్మాయిలు గ్రాడ్యుయేషన్ కొచ్చేసరికి ఆ కుర్రవాడిని వదిలేస్తారు. కానీ రాజుని నేను అలా వదలలేకపోయాను. బలహీనతల్ని కూడా ప్రేమించటం నేర్చుకోవాలి అని మనస్ఫూర్తిగా నమ్మినదాన్ని.." అంటూ ఆపి, కొనసాగించింది.

"అతడికి డబ్బు పట్ల సంతృప్తి లేదు. అతని విలువల పట్ల నమ్మకం లేదు. ఏ విధంగానైనా సరే సమాజంలో గుర్తింపు పొందాలి. డబ్బు సంపాదించాలి అన్నదే అతడి ధ్యేయం. నేను దానికి పూర్తిగా వ్యతిరేకిని...."

ప్రహసిత్ ఆమె మాటలకు అడ్డు తగులుతూ "ఈ ప్రపంచంలో ఎంతోమంది మొగవాళ్ళు ఎన్నో అడ్డదారుల్లో డబ్బు సంపాదిస్తున్నారు. వారి భార్యలందరూ వారిని ఖండించటంలేదు. పైగా తమ మొగుళ్ళ సంపాదన చూసుకుని మురిసిపోతున్నారు మధూ! ఒక్క విషయం గమనించు! ప్రస్తుతం సమాజంలో అవతలివారిని మోసం చేయటం కూడా ఆమోదయోగ్యమైన జీవనవిధానంగా మారిపోయింది" అన్నాడు.

"మిగతా వారి సంగతి నాకు తెలీదు. నాకు మాత్రం ఆత్మ అనేది ఒకటుంది. నా కళ్ళల్లో ఇప్పటికీ మామయ్యే కదులుతున్నాడు. కేన్సర్‌తో చనిపోయిన మా

అత్తమ్మే కనపడుతూంది.  కష్టార్జితమంతా పోగు చేసుకుని, రోగం నయమవుతుందన్న ఆ ఆశతో వచ్చే వందలాది పేషెంట్లకి ఆశ చూపించి, వారి కష్టాన్నంతా కొల్లగొట్టి తింటే....దానివల్ల ఏదైనా మిగులుతుందా? అటువంటి వ్యక్తికి భార్యగా నేనుండగలనా?"

"పోనీలే.  ఇప్పుడిక ఆ సమస్య లేదుగా.  అతడే నీమీద ఆధారపడి వుంటాడు"

"నేను చేప్పేది మా ఇద్దరి గురించి కాదు. అటువంటివాడిని ఎలా ప్రేమించావు అని అడిగారు కదా! దానికి సమాధానం చెపుతున్నాను.  పదిహేనేళ్ళ వయసులో ఏ గమ్యాన్ని ఆశించి నేను ప్రేమలో పడ్డాను అని ఆలోచిస్తుంటే ఇప్పుడు నవ్వూ దుఃఖమూ కలుగుతున్నాయి".

"నేను నీ వాదనతో ఏకీభవించను. ప్రేమ అనేది అవతలి వారి గురించి అన్నీ తెలిసిన తరువాత కలుగుతుంది అన్న  వాదన నిజం కాదు. మొదటి చూపులోనే కలగొచ్చు...."

"రెండో చూపులో పోవచ్చు"

"నీకు నా ప్రేమ మీద చాలా చిన్నచూపు వున్నట్టుందే"

అతడికి కోపం వచ్చిందని గ్రహించి కూడా ఆమె తన వాదనని ఆపు చేయలేదు.  "మీ ఉదాహరణే తీసుకోండి.  లక్ష్మిని మొదటిచూపులోనే ప్రేమించారు. కానీ ఆమెకి వివాహం అయిందని మీకు తెలీదు.  అంటే...మీరు  ప్రేమించిన వ్యక్తి మొట్టమొదటి అనర్హతే మీకు తెలీదన్నమాట".

"నేను ఆ అనర్హత వల్ల ఆమెని ప్రేమించటం మానలేదే"

"మీరొక హైపొతెటికల్ క్యారెక్టర్. అంతే!  నిజజీవితంలో అది సాధ్యం కాదు. పల్లెలో ఒక కుర్రాడిని  ప్రేమించి, పట్నానికి ఎమ్‌సెట్ వ్రాయటానికొచ్చి, ఆ వాతావరణంలో రిచ్‌నెస్ గమనించి మనసు మార్చుకున్న అమ్మాయిలు కొందరు నాకు తెలుసు."

అప్పటికి ప్రహసిత్ నవ్వాడు. "మరి నిజమైన ప్రేమంటే ఎలా మొదలవుతుందంటావ్?".

" జీరోబేస్‌లో మొదలవ్వాలి. శరీరాకర్షణని అధిగమించాలి. మిగతా ఆకర్షణా తళుకులన్నీ పోవాలి. వ్యక్తిత్వాలూ శరీరాలూ పర్ఫెక్టుగా వైబ్రేట్ అవ్వాలి. గమ్యం తెలిసుండాలి. అప్పుడు ప్రేమ  ప్రారంభం అవుతుందని నా వుద్దేశ్యం".

ప్రహసిత్ మరింత బిగ్గరగా నవ్వుతూ "ఇంపాజిబుల్, ఇంపాజిబుల్" అన్నాడు.

ఆమె అదే ఆవేశంతో "ఏం ఎందుక్కాదు? ఎందుకు ఇంపాజిబుల్?" అని అడిగింది.

"నువ్వు చెప్పేదే  నిజమయితే ప్రతి జంటా రెండు మూడేళ్ళు కలిసి కాపురం చేస్తేనే కానీ ప్రేమ ప్రారంభమవదు".

"నేనూ రాజూ అనుకున్నట్టు తొలి ఆకర్షణ ప్రేమ అనుకోవటం కన్నా అదే మంచిది కదా. అంతవరుకూ ఎందుకు? మీరు లక్ష్మిని మనసా వాచా కర్మణ ప్రేమించానన్నారు. నిజంగా లక్ష్మి మీ భార్య అయివుంటే సంవత్సరం తిరిగేసరికల్లా ప్రేమంతా కరిగిపోయి వుండేది".

ఆకస్మాత్తుగా అక్కడ వెంట్రుక కదిలితే వినపడేటంత నిశ్శబ్దం వ్యాపించింది.

ప్రహసిత్ స్తబ్దుడై చూశాడు. తను నోరు జారానని మధూహాకి అర్థమైంది. అయినా ఆమె తన వాదనలో వెనక్కి తగ్గదల్చుకోలేదు. "అవును ప్రహసిత్, లక్ష్మిది మీరందరూ అనుకునేటంత ఆదర్శమైన దాంపత్యం కాదు. ఇంతవరకూ వచ్చాక మీ దగ్గిర దాచేదేముంది? లక్ష్మి వ్రాసేది తన కథే అయితే చాలామంది మధ్య తరగతి స్త్రీలలాగే ఆమె తన సంసారం గురించి బయటపడదు, చాలా గుంభనగా వుంటుంది. మొన్న మొన్నటి వరకూ నాకూ తెలీదు".

ప్రహసిత్ ఇంకా ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు.

“లక్ష్మిలాంటి స్త్రీని కూడా నిర్లక్ష్యం చేసేవారుంటారా? ఆఫ్‌కోర్స్, విష్ణు గురించి నువ్వు ఇంతకు ముందే చెప్పావనుకో”.

లక్ష్మి నిజంగా చాలా మంచి అమ్మాయి ఒద్దికైనది. ఒకరి గురించి చెడుగా మాట్లాడదు, చీరెలమీదా నగలమీదా ఆశలేదు ......

ప్రహసిత్ నవ్వుతూ “ మరి అటువంటి అమ్మాయిని సంవత్సరం తిరిగేసరికల్లా వదిలేస్తానని ఎందుకనుకున్నావ్?” అన్నాడు వాతావరణాన్ని తేలిక చేయటానికి ప్రయత్నం చేస్తూ. మధూహ నవ్వలేదు.

“మీరు భారతదేశపు ప్రధాన టెన్నిస్ ప్లేయర్. ఆట మానేశాక కూడా ప్రతిరోజూ ఉదయం అయిదింటికే లేచి జాగింగ్ చేయటం గమనించాను”.

ఆమె ఏం చెపుతుందో అర్థం కానట్టు చూశాడు.

మధూహ తలెత్తి అతనివైపు సూటిగా చూసింది “మీరు ప్రేమించటానికి ఒక మంచి ఒద్దికయిన చీరెలమీద ఆశలేని అమ్మాయి చాలా?” అని అడిగింది.

అతడు మరింత కన్‌ఫ్యూజ్ అయి “నీవు చెపుతోంది నాకు అ ర్థం కావటం లేదు మధూ” అన్నాడు.

“అది అర్థమయితే ఈ దేశంలో చాలా సంసారాలు ఇంతకన్నా బాగా వుండేవి. భార్యాభర్తలు మరింత కమ్యూనికేషన్‌తో గడిపేవారు. నిజం చెప్పండి. మీ భార్యలో మంచితనం తప్ప మీరింకేమీ ఆశించరా?”

“ఆమె అలా ప్రవర్తించటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. భర్త నిరాసక్తత ఆమెలో ఆ విధమైన నిర్లిప్తతని కలిగించి వుండవచ్చు”.

మధూహ మరింత ఇరిటేటింగ్‌గా “ స్త్రీలు బ్రతికేది కేవలం భర్తల కోసమూ పిల్లల కోసమేనా? తమ కోసం తాము బ్రతకరా?” అంది. “భర్త నిర్లక్ష్యం చేస్తే, శరీరం అడ్డంగా పెరిగిపోతున్నా పట్టించుకోరు. ఎవరి కోసం అంటారు. భర్తకి మరింత ఆసక్తి చచ్చిపోతుంది. అనాసక్తి ఎవరిలో ముందు ప్రారంభమైందనేది చెట్టుముందా? విత్తు

ముందా లాంటి ప్రశ్న. ఈ విషయమంతా మొన్న మామధ్య చర్చకు వచ్చింది. చివరికి నేనేమన్నానో తెలుసా? ఈ రకమైన బ్రతుకు బ్రతకటం కంటే ప్రేమించిన ప్రహసిత్‌తో ఆనందించటం మంచిదని సలహా ఇచ్చాను”.

ప్రహసిత్ అప్రతిభుడై చూశాడు. సన్నగా వణికాడు. ఆమె అతడిని పట్టించుకోలేదు

“అవును. మరెందుకు ఈ జీవితం? అటు భర్తనీ సుఖపెట్టలేక తనూ సుఖపడక అంతా ఖర్మ మీదికి తోసేసి జీవచ్ఛవంలా బ్రతకటం కన్నా ఏదో ఒక కొత్తదాన్ని వెతుక్కోవటం సుఖం కదా. కనీసం అందులోనైనా ఆనందం దొరుకుతుందేమో” అని ఆగింది. “ కేవలం భర్తకి ఇది తెలిస్తే సెక్యూరిటి పోతుందేమోనన్న భయానికి ప్రేమ... కుటుంబం... నైతిక విలువలు అన్న పేరు పెట్టుకోవటం కన్నా ఆత్మవంచన మరొకటి వుందా? అది నిరాసక్తపు రొటీన్‌కి దారి తీయదా?”.

ఆమె ఆవేశం ఏ వాదనలకి దారితీసేదో కానీ, అప్పుడే పోస్ట్‌మాన్ రావటంతో సంభాషణకి బ్రేక్ పడింది.

ఒకటే ఉత్తరం వచ్చింది.

అది అగ్నిపర్వతంలా పేలింది.

చాలా మామూలుగా దాన్ని విప్పి చదవటం ప్రారంభించిన ప్రహసిత్, మొదటి వాక్యం చదవగానే నిటారుగా అయ్యాడు.

అతడి మొహంలో మార్పు గమనించిన మధూహాకి ఏమీ అర్థం కాలేదు

“ఏమిటది?” అని అడిగింది.

అతడు మౌనంగా ఉత్తరాన్ని ఆమెకు అందజేశాడు.

ఆమె గబగబా దాన్ని చదవసాగింది. చదవటం పూర్వయ్యేసరికి ఆమె మొహం కూడా రక్తం ఇంకిపోయినట్టు పాలిపోయింది.

అందులో ఇలా వుంది.

కష్టాలు చెప్పుకుందామని వచ్చిన ఆడదాన్ని ఓదార్పు పేరుతో ఊరి బయట హోటల్‌కి తీసుకెళ్ళి ఐస్‌క్రీమ్ తినిపించటం మంచివాళ్ళ లక్షణం కాదు. పెళ్ళయిన స్త్రీని లోబర్చు కోవటమంటే వెయిటర్‌కి రెండు రూపాయల టిప్ ఇవ్వటమంత సులభం కాదు. ఇదే ఆఖరి వార్నింగ్. మరోసారి ఇలా జరిగితే తరువాతి ఉత్తరం సరాసరి ఆమె భర్తకే వెళ్తుంది ...... ."

ఇద్దరూ ఆ ఉత్తరం వైపే నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోయారు. ఒకటే ప్రశ్న. ఎవరు వ్రాసి వుంటారిది?

"ఈ సారి కూడా అతను మిమ్మల్ని ఫాలో అయివుంటాడు" అంది మధూహ.

"అలాంటి అనుమానం వచ్చే జాగ్రత్తగా తీసుకెళ్ళాను ఆమెని" అన్నాడు.

"ఊరు చివర దాబా హోటల్‌కి వెళ్ళాం. వెళ్తున్నంతసేపూ కారు వెనుక ఎవరైనా వస్తున్నారేమోనని జాగ్రత్తగా గమనిస్తూనే వున్నాను. మమ్మల్ని ఎవరూ ఫాలో అవలేదని నిర్భయంగా చెప్పగలను" ఎన్నడూ లేనంతగా ప్రహసిత్ మొహంలో ఆందోళన కనిపించింది.

మధూహ ఆ ఉత్తరం వైపే పరిశీలనగా గమనిస్తూ " ఈ చేతివ్రాత ఎక్కడో చూశాను, ఎక్కడ చూశానా అన్నది గుర్తు రావటం లేదు. అప్పటినుంచీ ఆలోచిస్తూనే వున్నాను".

"నీకూ లక్ష్మికీ కామన్ స్నేహితులుగానీ స్నేహితురాళ్ళుగానీ వున్నారా?".

ఆమె తల అడ్డంగా ఊపుతూ " లేరు " అంది.

విష్ణు అతను వ్రాసి వుంటాడా అన్న అనుమానంతో అడిగాడు.

" కాదు, నిశ్చయంగా కాదు"

అతడొక క్షణం ఆగి " రాజు?" అన్నాడు.

" ఇంపాజిబుల్, అతడి చేతివ్రాత నాకు బాగా తెలుసు".

ప్రహసిత్ సాలోచనగా " ఇంటి చుట్టుపక్కల వాళ్ళు కూడా అవటానికి వీల్లేదు. ఆమెని ఇంటికి దూరంగా ఎక్కించుకున్నాను. అదీగాక కారు చాలా వేగంగా డ్రయివ్ చేశాను.పైగా ఆ దాబా హోటల్‌లో మేమిద్దరం తప్ప ఎవరూ లేరు. నేను టిప్‌గా రెండురూపాయలన్నర ఇచ్చానన్న విషయం నాకూ బేరర్ తప్ప మరెవరికీ తెలీదు" అన్నాడు.

ఆమె మరింత పరిశీలనగా ఆ ఉత్తరాన్ని గమనించింది. అతడు కూడా తన ఆలోచన్లలో తనున్నాడు.

" ఇలాంటివి మనసుని చాలా చిద్రం చేస్తాయి. పెద్ద పెద్ద ప్రమాదాల్ని సులభంగా ఎదుర్కోవచ్చు, కానీ ఇలాంటి చిన్న విషయాలు కాలిలో ముల్లులాగా నిరంతరం మనసులో ఒకమూల కదలాడుతూ రాత్రింబవళ్ళు గుర్తొస్తూ డిప్రెస్ చేస్తాయి. ముంచుకొచ్చిన పెద్ద ప్రమాదం కన్నా ఇది మరింత పెద్ద నరకం".

ఆకస్మాత్తుగా ఆమె కుర్చీ వెనక్కి వాలింది.

అతడామెవైపు చూశాడు.

ఆమె కనులు మూసుకుని దీర్ఘాలోచనలో వుంది. అతడేదో అనబోతుండగా ఆమె కనులు విప్పి "మనమొకసారి పత్రికాఫీసుకి వెళదామా?" అంది.

అతడు విస్మయంగా "ఎందుకు?" అన్నాడు.

"చెప్తాను, లేదంటే మీరుండిపోండి. నేను వెళ్ళి అక్కడనుంచి ఫోన్ చేస్తాను".

" వద్దు. నేనూ వస్తాను".